## మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



అధికారులతోవివ రాలుతె లుసుకుంటున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి, మే 24: మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులకు సూచించారు. శుక్రవారం వనపర్తి మున్సిపాలిటీని ఆకస్మికంగా సందర్శించి, కమిషనర్ పూర్ణచందర్‌తో కలిసి మున్సిపాలిటీ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల్లో తాగునీరు సమస్య, మురుగు కాల్వల నిర్వహణ క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. ఇంటిపన్ను వసూలు, పర్మిషన్ల రికార్డులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు ప్రక్రియ కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

- జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోవింద్‌నాయక్



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోవింద్‌నాయక్

గద్వాల, మే 24: జిల్లాలోని విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని, నాసిరకం విత్తనాలు సరఫరా చేస్తే డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో విత్తన డీలర్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ.. విత్తన డీలర్లు సరైన ప్యాకింగ్ ఉన్న కంపెనీ నుంచి వచ్చిన విత్తనాలు మాత్రమే విక్రయించాలని సూచించారు. రైతులు తీసుకున్న విత్తనాలకు సరైన రసీదు ఇవ్వాలని ఆదేశించారు. విత్తన రిజిస్టర్ రోజువారీ వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ నుంచి పంపిన ప్రత్యేక పట్టికను రోజువారీగా ఆప్‌డేట్ చేయాలని సూచించారు. విత్తన కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి పంచాయతీలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో వ్యవసాయశాఖ అధికారులు సంగీతలక్ష్మి, ఏవోలు ప్రతాప్‌కుమార్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

### నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

మానవపాడు, మే 24 : నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని సీడ్ డీలర్లను ఏవో సుబ్బారెడ్డి హెచ్చరించారు. మండలంలోని కలుకుంట్ల గ్రామంలోని రైతువేదికలో నియోజకవర్గంలోని విత్తన డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీలర్లు నకిలీ త్తనాలు అమ్మకూడదని, అధిక ధరలకు విక్రయించరాదని సూచించారు. అలాగే రిజిస్టర్‌ను ఏర్పాటు చేసి అందులో రైతు వివరాలను నమోదు చేయాలన్నారు. ప్రతి రోజూ స్టాక్ వివరాలను వ్యవసాయ అధికారులకు అందజేయాలన్నారు. ప్రతి మండలంలోనూ మొబైల్ టీం పర్యవేక్షిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయా మండలాల వ్యవసాయ అధికారులు, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పాలిటెక్నిక్ అర్హత పరీక్ష



పరీక్ష హాల్ వద్ద విద్యార్థులను పరిశీలిస్తున్న సిబ్బంది

వనపర్తి టౌన్, మే 24: వనపర్తి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పాలిటెక్నిక్ అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 10 కేంద్రాల్లో 2,394 మందికిగానూ 2,227మంది విద్యార్థులు హాజరవ్వగా 167 మంది విద్యార్థు లు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 93.02 శాతం హాజరయ్యారని ఆయన చెప్పారు. అందులో 1,263 మంది బాలురకు గా నూ 1,182మంది హాజరు కాగా 81 మంది గైర్హాజరయ్యారు. బాలికలు 1,131 మంది విద్యార్థులకుగానూ 1,045 మందికి గానూ 86 మంది గైర్హాజరవ్వగా మొత్తం 167 మంది గైర్హాజరైనట్లు చెప్పారు.

**కొత్తకోట మండలంలో..**

కొత్తకోట, మే 24: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని నివేదిత పాఠశాలలో 328మంది విద్యార్థులను కేటాయించగా.. 23మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం అధికారి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు పరీక్ష నిర్వహించారు.

**జోగులాంబ గద్వాల జిల్లాలో**

గద్వాల రూరల్, మే 24: పాలిటెక్నికల్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు డిస్ట్రిక్ కోఆర్డినేటర్ రామ్మోహన్ తెలిపారు. పట్టణంలోని నాలుగు సెంటర్లలో మొత్తం 1,589మంది విద్యార్థులకు గానూ 1,455 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు తెలిపారు. 91శాతం విద్యార్థులు పరీక్ష రాసినట్లు తెలిపారు.

## శాంతిభద్రతల పరిరక్షణే బాధ్యత

- డీఎస్పీ సత్యనారాయణ

వడ్డేపల్లి, మే 24 : శాంతిభద్రతల పరిరక్షణే తమ బాధ్యతని డీఎస్పీ సత్యనారాయణ పేర్కొన్నారు.శాంతినగర్‌లోని జమ్మల మడుగు కాలనీలో ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు డీఎస్పీసత్యనారాయణ, సీఐ రత్నం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. కాలనీలోని ఇండ్లు, పరిసరాలను పరిశీలించారు. అనుమానిత బైక్‌లను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కాలనీవాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ యువత, చిన్నారులు, నిరుద్యోగులు సెల్‌ఫోన్‌లో మోసపూరిత ప్రకటలను, గేమ్‌లను నమ్మి నష్టపోవద్దని సూచించారు. కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలు తగ్గుతాయని తెలిపారు. అనంతరం సీఐ రత్నం మాట్లాడుతూ కాలనీవాసులు ఒక గ్రూప్‌గా ఏర్పాటై నిధులు సేకరిస్తే సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శాంతినగర్ ఎస్సై సంతోశ్, ఇతర స్టేషన్ల ఎస్సైలు, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.



శాంతినగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ లో మాట్లాడుతున్న డీఎస్పీ

# అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తిచేయాలి

- జోగులాంబ గద్వాల కలెక్టర్ సంతోష్




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

గద్వాల, మే 24: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టాల్సిన మౌలిక వసతులకు సంబంధించిన పనులను త్వరిత గతిన పూర్తిచేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టాల్సిన పనులపై సంబంధిత శాఖ అధికారులతో మండలాలవారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చేపట్టాల్సిన పనులను పూర్తి చేయాలన్నారు. వారం రోజుల్లో అన్ని పాఠశాలల్లో కనీసం 50శాతం పనులు పూర్తి కావాలన్నారు. చేపట్టే పనులకు నిధుల కొరతలేదని, చేపడుతున్న అన్ని పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా పనులన్నీ పూర్తి కావాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సాధ్యమైనంత వరకు పనులు వేగవంతం చేయాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ తదితరులు ఉన్నారు.

# ఉర్సును వైభవంగా నిర్వహించాలి

- భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి
- ఆర్డీవో రాంచందర్

అలంపూర్, మే 24 : అలంపూర్ పట్టణంలో ఈనెల 30వ తేదీ నుంచి నిర్వహించే షా అలీ ఫహీల్వాన్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో, ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వహించాలని గద్వాల ఆర్డీవో రాంచందర్ అన్నారు. అలంపూర్ తాసీల్దార్ కార్యాలయంలో తాసీల్దార్ మంజుల అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆర్డీవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి ఏడాది షా అలీ ఫహీల్వాన్ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలో మత సామరస్యానికి ప్రతీకగా హిందూముస్లింలు కలిసికట్టుగా ఉర్సు నిర్వహిస్తారు. ఉర్సులో పారిశుధ్య కార్యక్రమాలు, మంచినీటి సౌకర్యం, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా, రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్చడం తదితర మౌలిక వసతులపై చర్చించారు. అలాగే భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేయాలని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల కోసం ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేయాలని, హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయాలని,ఆయా శాఖల అధికారులకు ఆర్డీవో ఆదేశించారు. కార్యక్రమంలో దర్గా డెవెలప్‌మెంట్ కమిటీ చైర్మన్ షా అహ్మద్ ఓవైస్, కమిటీ అధ్యక్షుడు రుక్కు, ఉపాధ్యక్షుడు షఫీ అహ్మద్, సెక్రటరీ ఖలీల్ , మున్సిపల్ కమిషనర్ సరస్వతి, వివిధ శాఖల అధికారులు, మత పెద్దలు అల్లాబకాస్, షాలీ మియ్య, ఉర్సు నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

### ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఆత్మకూరు, మే 24: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మోట్లంపల్లిలో చోటుచేసుకున్నది. ఎస్సై నరేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మగ్గాల రాములు(42) ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఇంటి రేకులషెడ్డుకు ఉరేసుకొన్నాడు. రాములు కొన్నాళ్లుగా ముగ్గురు కూతుళ్లు, భార్య మణెమ్మతో హైదరాబాద్‌లో జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 18న ఒక్కడే స్వగ్రామానికి వచ్చాడు. కొన్ని రోజులుగా ఛాతీలో నొప్పి కారణంగా వైద్యం కోసం స్వగ్రామానికి వెళ్తున్నట్లు భార్యకు చెప్పాడు. ఛాతీనొప్పి తగ్గడంలేదన్న మనస్తాపంతో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని అనుమానిస్తున్నారు. రెండ్రోజుల క్రితమే ఉరేసుకున్నట్లు తెలుస్తున్నది. రాములు ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు గమనించి భార్యకు సమాచారం ఇచ్చారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### కేశంపేటలో యువకుడు ..

గోపాల్‌పేట, మే 24: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రేవల్లి మండలంలోని కేశంపేటలో చోటు చేసుకున్నది. ఎస్సై తిరుపతిరెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లేశ్(24) తల్లి చిన్నతనంలోనే చనిపోగా, తండ్రి బాలయ్య కొడుకును వదలి రెండో పెండ్లి చెసుకున్నాడు. అప్పటి నుంచి మల్లేశ్ చిన్నాన్న నాగరాజు వద్ద కేశంపేటలో పెరిగాడు. మూడేండ్ల కిందట వనపర్తి మండలం చందాపూర్‌లో గొర్రెలకాపరిగా గాసం ఉంటున్నాడు. కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన ఒక అమ్మాయిని ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని అమ్మాయి తల్లిదండ్రులకు చెప్పగా.. అందుకు వారు నిరాకరించి, మందలించారు. మనస్తాపంతో రెండు రోజుల కిందట చిన్నాన్న వద్దకు కేశంపేటకు వచ్చాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి చిన్నాన్న నాగరాజు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### పురుగుల మందు తాగి..

వడ్డేపల్లి, మే 24: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కొంకల గ్రామంలో చోటు చేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గోకారి, మాహేశ్వరమ్మలకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు శివరాం (22)కు గురువారం రాత్రి క డుపు నొప్పి రావడంతో నొప్పి భరించలేక పురుగుల మందు తాగాడని తెలిపారు. చికిత్స నిమిత్తం కర్నూల్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు.

### పలు ఇండ్లల్లో చోరీ

వనపర్తి, మే 24: వరుస ఇండ్లల్లో గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీకి పాల్పడి 30తులాల వెండి, రూ.25వేల నగదు చోరీ చేసిన ఘటన అప్పాయిపల్లిలో చోటుచేసుకున్నది. రూరల్ ఎస్సై జలంధర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శంకర్‌రావు, ఆనంద్‌రావు ఇండ్లల్లో చొరబడి నగదు, వెండి వస్తువులను చోరీ చేశారు. అలాగే తదితరులకు సంబంధించిన అప్పు ఇచ్చినటువంటి ప్రాంసరీ నోటు బాండ్ పేపర్లను కాల్చివేసి పారిపోయినట్లు తెలిపారు. బాధితుడు దామరగిద్ద శంకర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాపు చేస్తున్నట్లు తెలిపారు.

### వేర్వేరు చోరీల్లో ఇద్దరి రిమాండ్

గద్వాల అర్బన్, మే 24: పట్టణంలో వేర్వేరు ఘటనలో చోరీ చేసిన కేసుల్లో ఇద్దరిని రిమాండుకు తరలించినట్లు పట్టణ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. గతనెల 24న ఏపీలోని చీరాలకు చెందిన నలుగురు కారులో పట్టణంలోకి చేరుకున్నారు. విఘ్నేశ్వర హ్యాండ్లూమ్ దుకాణంలో ఏడు చీరలు చోరీ చేసిన దేవర శివ, లేడిస్ కార్నర్ కౌంటర్లో రూ.20వేల నగదు చోరీ చేసిన గద్వాలకు చెందిన వెంకటేశ్‌ను రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

### నీటి సమస్య పరిష్కారం

గోపాల్‌పేట, మే 24: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో కొన్నిరోజులుగా తాగునీటి సమస్య ఏర్పడింది. ఈ విషయమై గ్రామస్తులు ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే గ్రామంలో బోరు వేయించారు. నీళ్లు పుష్కలంగా పడడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేసి శుక్రవారం బోరు బావికి మోటర్ బిగించారు.

### కుట్టు మిషన్ కేంద్రం ప్రారంభం

ఉండవెల్లి, మే 24 : మండలంలోని తక్కశిల గ్రామంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా శక్తి కుట్టు మిషన్ కేంద్రాన్ని మహిళా సమైఖ్య సీసీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో రథోత్సవం

- దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న భక్తులు..
- కిక్కిరిసిన క్యూలైన్లు

ఇటిక్యాల, మే 24 : నడిగడ్డ ఇలవేల్పు బీచుపల్లి అంజన్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గురువాం రాత్రి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి రథోత్సవం కార్యక్రమాన్ని తిలకించారు. భక్తుల రాకతో క్షేత్రపరిసరాలు కిక్కిరిసి పోయాయి. తమ ఇష్టదైవమైన అంజన్నకు కొత్తకుండలో కుడుములతో చేసిన నైవేద్యం (దాసంగాలు) సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈవో రామన్‌గౌడ్, ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా అర్చకులు ప్రహ్లాదాచారి, మారుతాచారి, సందీపాచారి, వాల్మీకి పూజారులు స్వామివారికి పంచామృతభిషేకం,చౌకిసేవ, బలిహరణం, ప్రభోత్సవం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



రథోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

# ప్రతిఒక్కరికీ ‘ఉపాధి’ కల్పించాలి

- డీఆర్డీవో నాగేంద్రం



మొక్కలకు నీళ్లు పట్టిస్తున్న డీఆర్డీవో నాగేంద్రం

వనపర్తి, మే 24: ప్రతి గ్రామంలో అవసరమైన మేరకు ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని డీఆర్డీవో నాగేంద్రం అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పెద్దగూడెం తండా, నాచహళ్లీలో పర్యటించి ఉపాధి హామీ పనులు, వాటర్ డే సందర్భంగా ఎంపీడీవో రాఘవతో కలిసి హరితహారంలో నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు సమయపాలన పాటించి కొలత ప్రకారం పని చేయించాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పనులు కల్పించాలన్నారు. అలాగే హరితహారంలో నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీళ్లు పట్టించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రామచంద్రయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శపాలకుడు జయరాములు

- వర్ధంతి సభలో ఐక్యవేదిక నాయకులు

వనపర్తి టౌన్, మే 24: ప్రజా పాలకుడిగా ఆదర్శవంతమైన పాలన అందించిన వ్యక్తి దివంగత మాజీ ఎమ్మెల్యే జయరాములు అని ఐక్యవేదిక సంఘ నాయకులు, జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మర్రికుంటలో ఉన్న ఆయన సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడారు. వనపర్తి జిల్లాలో 17 సార్లకుగానూ 4సార్లు మాత్రమే బీసీ నాయకులు ఎమ్మెల్యేలుగా వ్యవహరించారని గుర్తుచేశారు. బహుజనులందరినీ ఐక్యం చేసి రాబోయే ఎన్నికల్లో విజయభావుటా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సదస్సును నిర్వహించిన నిర్వాహకుడు సతీశ్‌యాదవ్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, స్వేరో రాష్ట్ర నాయకులు కిరణ్‌కుమార్, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, హైకోర్టు న్యాయవాది ప్రతాప్, రామకృష్ణ, ఖాదర్‌పాషా, గంధం నాగరాజు, రాజారాంప్రకాశ్ తదితరులు ఉన్నారు.



మాజీ ఎమ్మెల్యే జయరాములు సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఐక్యవేదిక నాయకులు



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## అ‘పూర్వ’ సమ్మేళనం

ఖిల్లాఘణపురం, మే 24: మండలంలోని సోలీపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన 1999-2000 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను స్మరించుకొని ఒకరినొకరు ఆనందంగా గడిపారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, శివాజీ, మహానంద్, వెంకట్రాములు, పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుడికు టుంబానికిఆ ర్థిక సాయం

పెద్దమందడి, మే 24: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997-98 బ్యాచ్‌కు చెందిన మధు కరోనాతో 2022లో మృతిచెందాడు. అదేబ్యాచ్‌లో మధుతో కలిసి చదివిన తోటి స్నేహితులు శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలో నివాసముంటున్న మధు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం స్నేహితులంతా పోగుచేసిన రూ.50 వేల నగదును మధు భార్య సుజాతకు అందజేశా రు. భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులున్నా తమ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మధు స్నేహితులు తదితరులు ఉన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

## నిర్ణీత సమయానికి హాజరు కావాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి, మే 24: జూన్ 9వ తేదీన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష రాయబోయే అభ్యర్థులు నిర్ణీత సమయానికి హాజరుకావాలని, ఒక్క నిమిషయం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 9వ తేదీన ఉదయం 10:30నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షకు విద్యార్థులను ఉదయం 9నుంచి 10గంటలోగా మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని తెలిపారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష రాయబోయే విద్యార్థులు http://www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో వెళ్లి నమూనా ఓఎంఆర్ షీట్, హాల్ టికెట్ నిబంధనల కాపీని డౌన్‌లోడ్ చేసుకొని సాధన చేసుకోవాలని సూచించారు. మే 23నుంచి ఓఎంఆర్ షీట్ ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చిందని, జూన్ 1 నుంచి హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

## స్థలం వివాదాన్ని త్వరలో పరిష్కరిస్తాం

- జోగులాంబ గద్వాల ఎస్పీ రితిరాజ్

గట్టు, మే 24: జిల్లాలోని గొర్లఖాన్‌దొడ్డిలో భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్ఠాపన చేయడానికి ఎంపిక చేసిన స్థలం విషయంలో నెలకొన్న వివాదాన్ని త్వరలోనే పరిష్కరిస్తామని ఎస్పీ రితిరాజ్ ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి పరిస్థితుల్లో కూడా ఈ వివాదానికి మతతత్వ రంగు పులుమొద్దని కోరారు. ఆ స్థలానికి యజమానులను గుర్తించే పనిలో రెవెన్యూ అధికారులు తలమునకలై ఉన్నారని పేర్కొన్నారు. అధికారుల నిర్ణయం రాగానే వివాదానికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వివాదాన్ని మతాల మధ్య గొడవ పెట్టేవిధంగా ప్రయత్నిస్తున్న వారిపై, సోషల్ మీడియాలో తప్పుడు పోస్ట్‌లు పెట్టిన వారిపై కూడా తప్పక చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

కొత్తకోట, మే 24: మండల కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో ఇంటర్ సప్లిమెంటరీ శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఫస్టియర్‌లో 67మంది విద్యార్థుల కుగానూ 63మంది హాజరు కాగా, మధ్యాహ్నం నిర్వహించిన సెకండియర్‌లో పరీక్షకు 19మందికిగానూ 18మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు 42 మందికిగానూ 39మంది హాజరు కాగా.. సెకండియర్ పరీక్షకు 17మందికి గానూ వందశాతం హాజరైనట్లు ప్రిన్సిపాల్ హైమావతి తెలిపారు.

## మత్స్యకారుల సొసైటీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

వనపర్తి, మే 24: జిల్లా మత్స్యకారుల కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేసినట్లు ఎన్నికల అధికారి టీట్సుపాల్ ప్రకటనలో తెలిపారు. ఈనెల 28వ తేదీన మత్స్యకార సొసైటీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ ప్రక్రియ మొదలవుతుందని, దానికి సంబంధించి పోటీల్లో నిలబడదల్చినవారు ఉద యం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, అనంతరం స్క్రూట్నీ మధ్యాహ్నం 1:30నుంచి 3గంటల వర కు, విత్‌డ్రా మధ్యాహ్నం 3:30నుంచి 5గంటల వరకు ఉంటుందన్నారు. పోలింగ్ జూన్ 1వ తేదీన ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉంటుందని, అనంతరం ఓట్ల లెక్కింపు, ఫలితాలను విడుదల చేయనున్నట్లు తెలిపారు.

## న్యాయం చేయాలి

వడ్డేపల్లి, మే 24: యువకుడిపై దాడి చేసి గాయపర్చిన దుండగులను గుర్తించి శిక్షించాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు శుక్రవారం శాంతినగర్ సీఐ రత్నంను కలిశారు. బాధితుల కథనం ప్రకారం ..కర్నూల్ జిల్లా పెద్ద మార్పాడు గ్రామానికి చెందిన మహ్మద్ మూడేండ్ల నుంచి శాంతినగర్‌లోని రాయిచూరు రోడ్డు పక్కన ఉండే రామాపురం గ్రామానికి చెందిన దివాన్‌వలీ చికెన్‌షాపులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ప్రతి రోజూ రాత్రిపూట కోళ్లఫారంలోనే నిద్రించే వాడు. రోజ మాదిరిగానే బుధవారం రాత్రి అతను పడుకొని ఉండగా గుర్తు తెలియని దుండగులు దాడిచేయడంతో తల, చెవివద్ద గాయమైంది. దీంతో మహ్మద్‌ను కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా ప్రస్తుతం కోమలో ఉన్నాడని చావుబతుకుల్లో పోరాడుతున్నాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాత్రి ఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి బాధితుడి తండ్రి ఖాజావలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఈ విషయంపై సీఐ రత్నం మాట్లాడుతూ దాడికి గల కారణాలను అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని, త్వరలోనే దుండగులను గుర్తించి శిక్షిస్తామని తెలిపారు.

## తాగునీటి సదుపాయం కల్పించాలి

వనపర్తి, మే 24: పట్టణంలోని 23వ వార్డులోని జమ్ములమ్మ ఆలయానికి తాగునీటి వసతి కల్పించాలని వార్డు ప్రజలు, భక్తులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌కు వినతిపత్రం అందజేశారు. మృగశిరకార్తె సందర్భంగా భక్తులు వేల సంఖ్యలో జములమ్మ ఆలయానికి వస్తారని, తాగునీటి సదుపాయం లేక భక్తులు ఇబ్బందులకు గురువుతారన్నారు. సమస్యను పరిష్కరించేందుకు ఆలయ ఆవరణలోనే ఉన్న బోరుబావికి మోటరు బిగించి నీటి సమస్యను తీర్చాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో యుగంధర్‌రెడ్డి, చెన్నారెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకటస్వామి, కృష్ణయ్య, రంగన్నయాదవ్, రాములు, నాగరాజు, చందు, శ్రీను, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటాం

వనపర్తి, మే 24: పట్టణ ప్రజల అవసరాలకనుగుణంగా ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు మున్సిపల్ కార్యాలయం ఎప్పుడూ సంసిద్ధంగా ఉంటుందని, అక్రమంగా కట్టడాలపై కఠిన చర్యలు తీసుకుంటుందని మున్సిపల్ చైర్మన్ మహేశ్ తెలిపారు. శుక్రవారం పట్టణ శివారులో అక్రమంగా నిర్మిస్తున్న రిజిస్ట్రార్ కార్యాలయ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ కృష్ణ, టౌన్‌ప్లానింగ్ అధికారితో కలిసి చైర్మన్ పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మహేశ్‌యాదవ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

ఉండవెల్లి, మే 24: ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని బైరాపురం గ్రామానికి చెందిన కుర్వ సంజీవ్‌కుమార్ ఫిబ్రవరి 27న ఇన్‌స్టాగ్రామ్‌లో కల్యాణ్ నైట్ వైబ్‌సైట్‌ను సర్ఫ్ చేయడంతో మనం పెట్టిన డబ్బుకు రెండింతలు ఇస్తామని ఓ వ్యక్తి నమ్మించి స్కానర్ పంపించాడు. ఇది నిజమని నమ్మిన సంజీవ్‌కుమార్ మొదటగా రూ.30వేలు పంపించాడు. డబ్బులు రాకపోవడంతో అవతలి వ్యక్తికి ఫోన్ చేయగా మరోసారి పంపిస్తే మొత్తం కలిపి పంపిస్తామని చెప్పడంతో మరోసారి రూ.45వేలు పంపిచాడు. ఇప్పటి వరకు రూపాయి కూడా రాకపోవడంతో ఆన్‌లైన్ ద్వారా మోసపోయానని గ్రహించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.